కాకినాడ జేఎన్‌టీయూ
వీసీగా నిట్ ప్రొఫెసర్
● ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ గవర్నర్

6


వంగర బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ నిద్రలో భాగంగా విద్యార్థినులతో కలెక్టర్ ప్రావీణ్య

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి
- తనిఖీల కోసం అధికారుల నియామకం
- భోజనం సక్రమంగా ఉండకపోతే చర్యలు
- వంగర గురుకుల పాఠశాల హాస్టల్ నిద్రలో కలెక్టర్ ప్రావీణ్య

6


నేడు మేడారంలో తిరుగువారం
వనదేవతల పూజా సామగ్రిని భద్రపరచనున్న పూజారులు
7

యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప.. అసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం.. ప్రకృతి సోయగాల సమాహారం లక్నవరం.. కాళేశ్వరం గోదావరి తీరం.. నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం.. వీటికి తోడు వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి, పాఖాల సరస్సు.. లాంటి అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు నెలవు ఓరుగల్లు. వారాంతమొస్తే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు ఆధ్యాత్మికతలో ఓలలాడుతుంటారు. ఈ క్రమంలో పర్యాటకును మరింత ఆకర్షించేలా.. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రైవేట్ భాగస్వామ్యంలో బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన రూపురేఖలు మార్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లోని పలు హరిత హోటళ్లు, రిసార్టులు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుండగా.. తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం మరికొన్ని పర్యాటక ప్రాంతాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు చేయాలని భావిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రైవేట్ భాగస్వామ్యం కార్యరూపం దాల్చితే సామాన్యులపై ఆర్థికంగా మరింత భారం పడుతుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.



పర్యాటకం.. ప్రైవేటుకు..!

బీవోటీ పద్ధతిలో టూరిస్టు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు

- ఆదాయం పెంపుతో పాటు పర్యాటకులకు సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా చర్యలు
- 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు ప్రైవేటు కంపెనీలకు లీజుకిచ్చే యోచన
- ఆయా పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులు వారి చేతుల్లోకే
- తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు
- కొత్త పర్యాటక ప్రాంతాలపైనా ఫోకస్
- ప్రైవేట్‌కు అప్పగింతతో సామాన్యులపై భారం పడే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లులోని పర్యాటక ప్రాంతాలు ఇక ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనున్నాయి. బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రైవేటు సంస్థలకు 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు లీజుకు ఇచ్చేందుకు కొత్త పాలసీని తీసుకొస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఉన్న హరిత హోటళ్లు, రిసార్టులను చాలా వరకు గత ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించగా, తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం కొత్తగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్న మరికొన్నింటిని కూడా ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇలా ప్రైవేట్ భాగస్వామ్యంతో టూరిజాన్ని అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షించటం, కొత్త పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటం లక్ష్యంగా పర్యాటకశాఖ అడుగులు వేస్తుంది. అయితే ఈ విధానంతో భవిష్యత్తులో సామాన్యులకు టూరిజం భారంగా మారనుందనే టాక్ కూడా వినబడుతుంది.

ఓరుగల్లు.. పర్యాటకానికి పెట్టని కోట. కాకతీయుల చారిత్రత్మక కట్టడాలు, ప్రకృతి సోయగాలు ఉమ్మడి వరంగల్‌లో అనేకం ఉన్నాయి. ఆదివారం, ఇతర సెలవు దినాలు వచ్చాయంటే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వాహనాలు రయ్‌రయ్ మంటూ ఓరుగల్లు వైపు పరుగుతీస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు అసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం, ప్రకృతి సోయగాలతో కట్టిపడేసే లక్నవరం అందాలు, ఐల్యాండ్, కాళేశ్వరం గోదావరి జలాలు, ఆధ్యాత్మిక క్షేత్రం, పచ్చని అడవుల మధ్యన నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం సవ్వడులతో పాటు కనువిందు చేసే వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి, పాఖాల సరస్సు.. ఇలా అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు వరంగల్ నెలవు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు హోటళ్లు, రిసార్టులను ఏర్పాటు చేసింది. దేశీయ, విదేశీ పర్యాటకులు కూడా ఓరుగల్లు అందాలను చూసేందుకు సుదీర్ఘ ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు.

ఇక ప్రైవేటు చేతిలోకి పర్యాటకం..

పర్యాటకానికి పర్యాయపదంగా ఉన్న ఓరుగల్లులోని అనేక ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్‌లో భాగంగా తెలంగాణ ట్రైబల్ సర్క్యూట్‌లో భాగంగా ములుగు, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లో రూ.83కోట్ల వ్యయంతో టూరిస్ట్ స్పాట్‌లు, కాటేజీలు, డార్మెటరీలు, హోటళ్లను నిర్మించింది. మేడారం, బొగత, లక్నవరం, గణపురం, కాళేశ్వరం, రామప్ప, మల్లూరు, ములుగు గట్టమ్మ, జంగాలపల్లి వద్ద, తాడ్వాయి తదితర ప్రాంతాల్లో హరిత హోటళ్లను నిర్మించారు. వీటిలో గత ప్రభుత్వం మేడారం, తాడ్వాయి, బొగత, జంగాలపల్లి, గట్టమ్మ హరిత హోటళ్లు, రెస్టారెంట్లను ప్రైవేట్‌కు లీజుకు ఇచ్చారు. అయితే గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీవోటీ పద్ధతిలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. హనుమకొండ హరిత కాకతీయ హోటల్ మినహా మిగతా అన్ని హోటళ్లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే యోచనలో ఉంది. హోటళ్లతో పాటు బీవోటీ పద్ధతిన పర్యాటక ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపడతోంది. బీవోటీ అంటే నిర్మాణం, నిర్వహణ, బదిలీ అని అర్థం. ఈ మూడు ప్రతిపాదికన టూరిజం ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా ప్రాజెక్టుల స్థాయిని బట్టి 15ఏళ్ల నుంచి 66ఏళ్ల వరకు లీజుకు ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ అంతా ఈ టెండర్ విధానంలో జరగనుంది.

తొలిదశలో ఓరుగల్లులోని ఐదు టూరిజం స్పాట్లు

రాష్ట్ర పర్యాటక శాఖ దేశంలోనే తెలంగాణను పర్యాటక రంగంలో టాప్-5లో ఉంచాలనే ఆలోచనతో భారీ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే బీవోటీ

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్/హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అధికారులు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా జిల్లాల అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, రబీ పంటలకు సాగునీరు, విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామని, రబీ సీజన్‌లో 2 లక్షల 28వేల ఎకరాలు సాగు చేస్తున్నారని, రైతు భరోసా కింద లక్షా 63వేల మందికి గాను 91 వేల మందికి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలను తరుచుగా తనిఖీ చేస్తున్నామని, ఆహార నాణ్యత, విద్యాబోధన మెరుగు పడిందని అన్నారు. విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జడ్పీ సీఈవో రామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాంతికుమారి, పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై కలెక్టర్‌లతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతికుమారి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా సరఫరా కొనసాగించాలని, రైతు భరోసాపై గ్రీవెన్స్‌సెల్‌ను జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఐదు రోజులలో అదనపు భూ వివరాల నమోదు పోర్టల్‌లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను వినియోగించుకుని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి సమస్య లేదని, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేతిపంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని డివిజన్లకు ధర్మసాగర్ నుంచి నీటి సరఫరాను చేయనున్నామన్నారు. ప్రస్తుతం 24 నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో అదనంగా 21 నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానీజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


కార్‌లో పెట్రోల్ పోస్తున్న డీజీ సౌమ్యమిశ్రా, కలెక్టర్ సత్యశారద

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం
- డీజీ సౌమ్య మిశ్రా
- సెంట్రల్ జైలు ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ప్రారంభం

7

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి
- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా ఎదుట ఉన్న బయోగ్యాస్ ప్లాంట్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు కాలనీల ప్రజలు తడి పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి యంత్రాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో జమ చేయాలని అన్నారు. ప్రతీ రోజు బల్దియా నుంచి చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు విడి విడిగా చెత్తను అందిస్తే శుద్ధి చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి హార్టికల్చర్ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలకు ఎరువుగా అందించవచ్చని అన్నారు. బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ను ప్రతీ రోజు రెండు గంటల పాటు ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఇంకా పొడి చెత్తను ముందుగా డీఆర్‌సీసీ కేంద్రాలకు ఆ తర్వాత వివిధ ప్రాంతాలలోని రీ సైక్లిలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. బయో ప్లాంట్ ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చని అన్నారు. రెండు రకాల చెత్తను వేరు వేరుగా సేకరించడం వల్ల డంపింగ్ యార్డ్‌కు పెద్ద ఎత్తున చెత్త వచ్చే సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగర ప్రజలు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బయోగ్యాస్ ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.


బయో గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మూతపడుతున్న విద్యా సంస్థలు
- విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. నర్సంపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నేడు అనేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయని అన్నారు. కొట్లాడి ప్రత్యేక తెలంగాణ సాధించుకుని బాగుపడతామనుకుంటే రాష్ట్రంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు నాలుగేళ్లుగా విడుదల కాకపోవడంతో టీచర్లకు వేతనాలు చెల్లించలేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయన్నారు. జీవో 317ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, ఉపాధ్యాయులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీ లేదని, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. నిరుద్యోగ యువకులు, ఉపాధ్యాయులు ఆలోచన చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమస్యలపై పోరాడే బీజేపీకి అండగా నిలవాలన్నారు. కస్తూర్బా గురుకులాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయులపై పనిభారం పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పడానికి పదేళ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న భ్రమలు తొమ్మిది నెలల్లోనే తొలగిపోయాయన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షత చూపిందని కాంగ్రెస్ మాట్లాడటం హాస్యాస్పదమని, బడ్జెట్ అనేది ఆయా రాష్ట్రాల అవసరాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసింది తక్కువేనని, బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లో రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టు కోసం రూ.2వేల కోట్లు వెచ్చించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. పార్లమెంట్‌లో అధికార పార్టీ ఎంపీ నైనప్పటికీ గ్రీన్‌ఫీల్డ్‌పై తాను మాట్లాడానని, రైతులకు అన్యాయం జరగవద్దని కోరడం జరిగిందన్నారు.

సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు సీతారాంనాయక్, కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్, బైరి మురళీకృష్ణ, హరిశంకర్, రాంచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, గూడూరు సందీప్, కాళీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు.

రాణిరుద్రమకు ఈటల పరామర్శ

నర్సంపేట పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నేత రాణిరుద్రమ, జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డిల తల్లి గోగుల జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం ఈటెల రాజేందర్ సందర్శించి పరామర్శించారు. మృతురాలు జయశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

విద్యార్థుల నృత్య ప్రదర్శన భేష్ : ఎమ్మెల్యే

తొర్రూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నృత్య ప్రదర్శన అభినందనీయమని మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ, తాండవ కృష్ణ నృత్యాలయ సంస్థ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా నాట్యఉత్సవం, పేరిణి నాట్యాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. తొర్రూరుకు చెందిన మువ్వ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీయం అన్నారు. వారిని అభినందిస్తూ బహుమతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, గట్టు నవీన్, మల్లిక్, గణపతి రెడ్డి, ఉమా మురళీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్ మెడల్ గ్రహీత అంజయ్యకు సన్మానం


అంజయ్యను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగిన 68వ ఆలిండియా పోలీస్ డ్యూటీమీట్‌లో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బాంబ్‌స్క్వాడ్ అంజయ్య ఆలిండియాలో సిల్వర్ మెడల్ సాధించారు. మంగళవారం చేరుకున్న అంజయ్యను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్‌కేకన్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.. పోలీస్ డ్యూటీమీట్‌లో అంటి సబటేజ్ చెక్‌రూం సర్చ్ విభాగంలో వీవీఐపీ, వీఐపీలు నివాసముండే రూంలను ఎలాంటి హానికర వస్తువులు లేకుండ చూసుకునే విధానంలో తెలంగాణ రాష్ట్ర తరుపున పాల్గొని అంజయ్య సిల్వర్‌మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. ప్రతి పోలీస్ అంజయ్యను స్ఫూర్తిగా తీసుకుని విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, అడ్మిన్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, బాంబ్‌స్క్వాడ్ సిబ్బందిపాల్గొన్నారు.

మహిళను వేధించిన ఒకరికి రిమాండ్

కురవి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వివాహితను వేధించిన కేసులో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తులిస్యాతండాకు చెందిన బాదావత్ బాలాజీని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంద్రాతి సతీష్ తెలిపారు. తులిస్యాతండాకు చెందిన వివాహిత బాదావత్ సరితను బాలాజీ కొంతకాలంగా వెంటపడుతూ.. వేధిస్తున్నాడు. ఈ విషయమై గతంలో కేసు నమో దైనా బాలాజీ తన ప్రవర్తన మార్చుకోకుండా సరితను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


గూడూరు కేజీబీవీలో ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్

గూడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తమ కోసం కొట్లాడేందుకు నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా, మోసం చేశాయన్న అభిప్రాయంతో ఉన్నారన్నారు. ఈనెల 28న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుంచి ఇప్పటి వరకు ప్రైవేట్ కళాశాలలకు బోధన రుసుము ప్రభుత్వం చెల్లించకపోవడంతో కళాశాలలు అప్పులు ఊబిలో కూరుకుపోయాయని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం తమను దగా, మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలైనా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చెల్పూరి వెంకన్న, మేరెడ్డి సురేందర్, రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం ఖాయం

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపు ఖాయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన మరిపెడ హైస్కూల్ టీచర్లతో సమావేశమై పులి సరోత్తంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యావత్ ప్రపంచం ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాపై చర్చించుకుంటున్నారన్నారు. బీజేపీతోనే దేశ భద్రత ఉందని దేశ ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. ఉపాధ్యాయులు సైతం అలోచన చేసి బీజేపీని ఈ ఎన్నికలలో బలంగా బలపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు, చీకటి మహేశ్‌గౌడ్, గంగాధర్, మంగమ్మ, లింగంనాయక్, బింగి రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్


విలేకరులతో మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్

పెద్దవంగర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఉదయభాస్కర్ మట్లాడుతూ గ్రామాలలో మహిళలు పెద్ద ఎత్తున సంఘాలుగా ఏర్పాడి చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారు చేసి విక్రయించాలన్నారు. నాబార్డు ద్వారా అందిస్తున్న సేవాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. చిరుధాన్యాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని అన్నారు. నేటి మహిళలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఏదైనా సాధించగలమన్న పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. మహిళ ప్రగతితోనే సామాజాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళా సంఘాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాబార్డుఏజీఎంలు చంద్రశేఖర్, రవి, అసిస్టెంట్ మేనేజర్ నితిన్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, సీఈవో తల్లూరి లత, చైర్మన్ శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

బీజేపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివృద్ధికి అందరిని కలుపుకుంటూ కృషి చేస్తానని జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వెంకటేశ్వర్లుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం కాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటికి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, జాటోత్ హుస్సేన్‌నాయక్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, వద్దిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, శశివర్ధన్‌రెడ్డి, చీకటి మహేష్‌గౌడ్, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, సురేందర్, చెల్పూరి వెంకన్న, భాస్కర్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

ఆ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్ రెడ్డి

తొర్రూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పీఆర్టీయూతోనే పరిష్కారమవుతాయని వరంగల్-ఖమ్మం-నల్లగొండ అధ్యాపక, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తొర్రూరులో ఉపాధ్యాయులను కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవ నినాదంతో పీఆర్టీయూని స్థాపించి ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. వివిధ దశల్లో 30 శాతం పీఆర్సీ ఏర్పాటు చేయించిన ఘనత పీఆర్టీయూదేనని అన్నారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తున్నామన్నారు. ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంక బద్రినారాయణ, కార్యదర్శి మిరియాల సతీష్ రెడ్డి, మండల అధ్యక్షుడు విప్లవ్‌రెడ్డి, ముత్తిలింగం, అశోక్‌రెడ్డి, యాకయ్య, వెంకట్‌రెడ్డి, కనకయ్య, ఉమాదేవి, టీచర్లు పాల్గొన్నారు.

సుమతిరెడ్డి మహిళా కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా


మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (యూజీసీ), (జేఎన్‌టీయూహెచ్) ఆటానామస్ హోదా వచ్చినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి మంగళవారం తెలిపారు. హనుమకొండలోని కాకాజీ కాలనీలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ.. సుమతిరెడ్డి కళాశాల విద్యార్థినులు వివిధ కంపెనీలలో పనిచేస్తూ ప్రపంచంలోనే ఎస్ఆర్, సుమతిరెడ్డి కళాశాలల ప్రతిష్ఠను కీర్తిని పెంచారని తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా వలన కళాశాలకు అకాడమిక్ మెరుగుదల, సాంకేతిక అభివృద్ధి, కళాశాల అభ్యున్నతికి దోహద పడుతాయన్నారు. కళాశాల హోదా పెరిగి మంచి గుర్తింపు రావడంతో విద్యార్థినులకు మెరుగైన అవకాశాలు వస్తాయన్నారు. ఎస్ఆర్ఐటీడబ్ల్యూ తన పాఠ్యప్రణాళిక రూపకల్పన, మూల్యాంకన ప్రమాణాలు ఏర్పర్చుకోవడం వలన ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు వివిధ కంపెనీలకు సంబంధించిన పాఠ్యాంశాలను పొందుపర్చి విద్యార్థినుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రపంచ స్థాయిలో ఉద్యోగ, వ్యాపార వేత్తలుగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎస్ఆర్ఐటీడబ్ల్యూ అన్ని రంగాల్లోని విద్యార్థినులను ఉత్తేజం చేస్తూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఈ.సుదర్శన్, కె. మహేందర్, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో రోజురోజుకు పెచ్చుమీరుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం బయ్యారంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు షీ టీం, స్థానిక పోలీసులు సంయుక్తంగా కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు షీ టీం, భరోసా, న్యూ క్రిమినల్ లా, మానవ అక్రమ రవాణ, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీఎం ఎస్సై సునంద, ఎస్సై తిరుపతి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటి వారితో ఫోన్ కాల్స్ గాని, వాట్సప్ కాల్స్ గాని మాట్లాడొద్దన్నారు. అపరితి వ్యక్తులు, గ్రూపుల నుండి వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దన్నారు. ఒకవేళ ఆపదలో చిక్కుకున్నామని గ్రహిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఏదేని సమస్య ఉత్పన్నమైతే టీ-సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్ మీది అవగాహన కల్పించాలని సూచించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతి

అవసరమైన ఆత్మ రక్షణ విద్యలను నేర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను వినియోగించే వారు ముందుగా వాటి పరిధిని తెలుసుకుంటే సేఫ్‌గా ఉండటానికి ఆస్కారం ఏర్పడుతుందని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాల సీజ్

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అధిక లోడ్‌తో వెళ్లుతున్న రెండు వాహనాలను మంగళవారం మహబూబాబాద్ ఆర్టీవో సాయిచరణ్ సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రతిఒక్కరు లైసెన్, ఇన్స్‌రెన్స్ చేయించుకోవాలన్నారు. హెల్మెంట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియామాలు పాటించాలన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

గ్రంథాలయ సంస్థ ములుగు జిల్లా చైర్మన్ రవిచందర్


సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి మొక్కుతున్న బంజారాలు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బంజారాలు సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గాన్ని అనుసరిస్తూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని పత్తిపల్లి గ్రామంలో సేవాలాల్ గోరుమాటి మళావ్ ఆధ్వర్యంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు జరగగా రవిచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజారి బాల బ్రహ్మచారి కిషన్ మహరాజ్ మహాభోగ్ నిర్వహించి సేవాలాల్ విశిష్టతను, గోర్ జాతికి చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని గ్రామంలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. గ్రామంలో సేవాలాల్ మహారాజ్ గుడిని నిర్మించేందుకు మంత్రి సీతక్కతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. అనంతరం మహాభోగ్ భండారో, మహా అన్నదానం నిర్వహించగా బంజారాలు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోర్ సిక్వాడి సేనలు పోరిక రాజుకుమార్, రాహుల్, హరిలాల్, బాబు, రవివర్మ, ప్రతాప్‌సింగ్, పోరిక నందనాయక్, భీమానాయక్, హట్కర్ హేమ్‌లాల్, ధరావత్ సారయ్య, ప్రతాప్‌సింగ్, ఇస్లావత్ భద్రు, పోరిక భద్రు, మూడ్ పుష్ప, రాజ్‌కుమార్, రవీందర్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు..

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ బయ్యారంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డు పోస్టు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఫోరం తలపెట్టిన పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా నాయకులు స్థానిక పోస్టుపీస్ నుండి సీఎం రేవంత్ రెడ్డికి లేటర్ పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు రెంటాల బుచ్చిరెడ్డి, నాయిని శ్రీనివాస్ రెడ్డి, వన్నం రామారావు, కాసం ఉప్పల్‌రెడ్డి, మీసాల వెంకటయ్య, యాదగిరి, వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ. 25 వేలు ఫించన్ ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల బడ్జెట్ కెటాయించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రైలు పాసులివ్వాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.


బయ్యారంలో సీఎం రేవంత్ రెడ్డికి లేఖలు పంపుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

ఉపాధ్యాయులు సాంకేతికతపై దృష్టి పెట్టాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి
- జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి

వాజేడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలని ములుగు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి అన్నారు. వాజేడు మండల కేంద్రంలో జడ్పీ పాఠశాలలో జరుగుతున్న ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ట్రైనింగ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగుడెం, ఏటూరునాగారం, మంగపేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ఈ శిక్షణలో ఉన్నారు. రానున్న కాలమంతా ఇంటర్నెట్ అనుసంధానంగా బోధనలు ఉండే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతికతపై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. శిక్షణ కేంద్రంలో ఇచ్చే సూచనలు పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సోయం ఆనందరావు, స్వరూప్ సింగ్, జాకీర్‌అలీ, లకావత్ బాలాజీ తదితరులు ఉన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యాబోధన ప్రక్రియలో భాగంగా ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని విద్యార్థులను సమకాలీన ప్రపంచంలో పోటీకి దీటుగా తీర్చిదిద్దాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి అన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్వాయి ఉన్నత పాఠశాలలో హిందీ పాఠశాల సముదాయ సమావేశం మంగళవారం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన విద్యావిధానం సాంకేతికతకు పెద్దపీట వేస్తుందని, ఉపాధ్యాయులు ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకుని దృశ్యశ్రవణం మాధ్యమాల సహాయంతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన విజ్ఞానం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు షేక్ హాజీ నూరాని, జిల్లా రిసోర్స్‌పర్సన్ పొద్ది రవి, మండల రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాజేడులో శిక్షణను పరిశీలిస్తున్న ఏఎంవో మల్లారెడ్డి

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం

- డీజీ సౌమ్య మిశ్రా
- సెంట్రల్‌జైలు ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ప్రారంభం

మామునూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా అన్నారు. మామునూరులోని సెంట్రల్ జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మంగళవారం ఆమె ప్రాంభించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం సెంట్రల్ జైలును సందర్శించారు. ఖైదీలతో ముచ్చటించారు. ఖైదీలు పండించే పంటలు, జైలులో సౌకర్యాలు, వారు చేసే ఆర్గానిక్ వ్యవసాయ పంటలను డీజీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖైదీలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే మళ్లీ నేరాల వైపు వెళ్లరనే ఉద్దేశంతో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల సత్ప్రవర్తన కోసం జైళ్ల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 30కి పైగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి విడుదలైన ఖైదీలతో పాటు ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్న వారికి కూడా అందులో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మొదట 2013లో చంచల్ గూడ జైలు వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. బంకులలో వచ్చిన ఆదాయంతో ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్న కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా, ఖైదీల పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందజేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు క్షమాభిక్ష కోసం డీజీకి వినతిపత్రాలను అందజేశారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వినియోగదారులకు కల్తీలేని నాణ్యమైన ఇంధనం అందించడమే కాకుండా ఖైదీలకు ఉపాధి కల్పిస్తున్న జైళ్ల శాఖ పనితీరు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, భారత్ పెట్రోలియం రిటైర్డ్ అధికారి నితిన్ సెలూకర్, కేంద్రకారాగార వరంగల్ పర్యవేక్షణ అధికారి టి.కళాసాగర్, ఉప పర్యావేక్షణ అధికారులు వెంకటేశ్వర స్వామి, ఎం.జ్యోతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపి సౌమ్యమిశ్రా

భద్రకాళి ఆలయంలో పూజలు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా దర్శించుకున్నారు. మంగళవారం మామునూరు సెంట్రల్ జైలు పరిశీలనకు వచ్చిన ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పాలికారు. అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఆమె వెంట ఈవో శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ సిబ్బంది, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సౌమ్యమిశ్రా

రుద్రేశ్వరుడి సన్నిధిలో..

హనుమకొండ కల్చరల్ : నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని వరంగల్ పర్యటనకు విచ్చేసిన జైళ్లశాఖ డిప్యూటీ ఐజీ సౌమ్యామిశ్రా మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, ఇతర అర్చకులు ఆలయ మర్యాదలతో ఆమె స్వాగతించి తొలుత ఉత్తిష్ట గణపతిని దర్శింపజేసి రుద్రేశ్వరుడి సన్నిధిలో బిల్వార్చన నిర్వహింపజేసి ఆలయ నాట్య మండపంలో స్వామివారి శేషవస్త్రాలు బహూకరించి మహదాశీర్వచనం నిర్వహించా రు. ఈ సందర్భంగా సౌమ్యామిశ్రా గతంలో తాను ఉమ్మడి జిల్లా ఎస్పీగా పని చేసినప్పుడు ఈ ఆలయాన్ని ఎన్నోసార్లు సందర్శించానని, ఆలయ ప్రాశస్త్యాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని ఆమె అన్నారు. పలువురు జైళ్ల శాఖ అధికారులు, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వినతులు స్వీకరించిన మంత్రి సురేఖ

వరంగల్‌సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం హనుమకొండలోని ఆమె నివాసంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలపై వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ప్రజలు దరఖాస్తులు అందించారు. వాటిలో కొన్ని సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అప్పటికప్పుడు పరిష్కారం చూపారు. కొన్నింటిని అధికారులకు రిఫర్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేడు మేడారంలో తిరుగువారం

వనదేవతల పూజా సామగ్రిని భద్రపరచనున్న పూజారులు



మేడారంలోని సమ్మక్క మందిరం



కన్నెపల్లిలోని సారలమ్మ మందిరం

తాడ్వాయి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల తిరుగువారం పండగను బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పూజారులు మేడారంలో సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ మందిరంతో పాటు వనదేవతల పూజా సామగ్రిని కూడా శుభ్రపరుస్తారు. ఈ క్రమంలో తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. మహాజాతర వరకు ప్రజలందరినీ సుభిక్షంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కుటుంబ సమేతంగా పూజారులు వేడుకుంటారు. అనంతరం వన దేవతల పూజా సామగ్రిని ఆయా తల్లుల మందిరాల్లో భద్రపరుస్తారు. దీంతో మినీ జాతర తంతు ముగుస్తుంది. ఇక ఆదివారం పూజారులు వనభోజనాలకు వెళ్తారు.

వన ప్రేమికుడు.. ఇట్టే పాములను పట్టేస్తాడు..

సర్పాలను చాకచక్యంగా పట్టి అడవుల్లో వదులుతున్న స్నేక్ క్యాచర్ రహీమ్



గణపురం మండలం కర్కపల్లి గ్రామంలోని ఓ ఇంట్లోకి వచ్చిన నాగుపామును పట్టి డబ్బాలో బంధిస్తున్న స్నేక్ క్యాచర్ రహీమ్ (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యో తి) : ఆయనో వన ప్రేమికుడు. పర్యావరణ పరిరక్షణ అంటే అమితమైన ఇష్టం. పంక్చర్ షాపు నిర్వహించు కుంటూ జీవనం సాగించే ఆయన ఖాళీ సమయాల్లో మొక్కలు నాటుతుంటాడు. అంతేకాదు మొక్కలు నాటడం అందరి బాధ్యతంటూ ప్రచారం చేస్తుంటాడు. అలా ప్రకృతి పరిరక్షణకు నడుంబిగించిన భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన సయ్యద్ రహీమ్ పాషాకు ఆయనకు భార్య రెహానాబేగం కూడా చేదోడువాదోడుగా నిలుస్తూ ఉంటుంది. పర్యావరణ పరిరక్షణలో వనప్రేమికుడిగా గుర్తింపు పొందిన ఆయన మూగజీవాల సంరక్షణకూ పాటుపడుతుంటారు. అలా రహీమ్‌పాషా పాములను కూడా చాకచక్యంగా పట్టి.. వాటిని చంపకుండా అటవీ ప్రాంతాల్లో వదిలేస్తుంటాడు. ఎలాంటి విషసర్పాలనైనా అలవోకగా పట్టేసే రహీమ్‌పాషాకు 'స్నేక్ క్యాచర్'గా కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది. 'పాము ఉంది.. పట్టడానికి రావాలి' ఎవరు ఫోన్ చేసినా వెంటనే రహీమ్, రెహానా ఇద్దరూ తమ ఎక్సెల్ వాహనంపై బయల్దేరుతారు. అక్కడ ఎవరికి హానీ కలుగకుండా.. పామును బంధిస్తారు. ఇప్పటి వరకు సుమారు 946 పాము లను పట్టిఉంటామని, వాటన్నిటిని భూపాల పల్లి మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలేశా మని వారు తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు సమీప ప్రాం తాల్లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, జనావాసాలు, ఇళ్లు, వ్యాపారాల దుకాణాల్లోకి వచ్చిన పాములను పట్టిన సమయంలో ఆ పాముల నుంచి రక్షణ పొందిన వారు ఎంతిస్తే అంత తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని రహీమ్ తెలిపారు. కాగా, ఇప్పటి వరకు తనకు ఎవరూ సహాయమందించడం లేదని, కనీస రక్షణ పరికరాలు కూడా లేవని, మూడుసార్లు తాను పాముకాటుకు గురై ప్రాణాపాయం నుంచి బయటపడ్డానన్నారు. దాతలు ముందుకొస్తే పాములతో హాని లేకుండా ఎంత దూరమైన వెళ్లి వాటిని బంధిస్తానంటున్నాడు. అయితే, ఏ పామైనా వాటికెక్కడా హానీ కలిగిస్తామోననే ఆత్మరక్షణ కోసమే అవి కాటేస్తాయని, పాములు కనిపిస్తే భయాందోళనకు గురై రాళ్లతో కొట్టడం, కర్రలు విసరడం లాంటివి చేయవద్దని రహీమ్ కోరుతున్నారు.

వెంటాడుతున్న బర్డ్‌ఫ్లూ భయం

- చికెన్ తినేందుకు జంకుతున్న జనం
- వెలవెలబోతున్న దుకాణాలు
- తగ్గుతున్న బిర్యానీ, గుడ్ల విక్రయాలు
- ఆవేదనలో వ్యాపారులు



కొనుగోలుదారులు లేక వెలవెల బోతున్న హనుమకొండ కుమార్‌పల్లి రోడ్ లోని ఓ చికెన్ సెంటర్



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు చికెన్ ప్రియులను.. మరో వైపు చికెన్ వ్యాపారులు.. ఇంకోవైపు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులను బర్డ్ ఫ్లూ వైరస్ భయం వెంటాడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ వైరస్ ఎక్కడా నిర్ధారణ కాకపోయినా.. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల్లో వేలాది కోళ్ల మృత్యువాత పడటం, ప్రభుత్వం కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించడం, కోళ్ల రవాణాపై ఆంక్షలు విధించడంతో చికెన్ ప్రియులు మరింత భయాందోళన చెందుతున్నారు. చికెన్ ముక్కలేనిదే ముద్ద దిగని వారు బర్డ్‌ఫ్లూ భయం నేపథ్యంలో అసలు చికెన్ తినాలా వద్దా అనే సందిగ్ధంలో సతమతమవుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాతో పాటు నగరంలోని చికెన్ సెంటర్లు వెలవెల బోతున్నాయి. అమ్మకాలు తగ్గిపోవడంతో షాపుల నిర్వాహకులు ఆవేదనకు గురువుతున్నారు. అదే విధంగా కోడి గుడ్లను కూడా కొనేందుకు ఆసక్తి చూపకపోవడం తో గుడ్ల రేట్లు తగ్గముఖం పడుతున్నాయి. హనుమకొండ చౌరస్తా పరిసర ప్రాంతాల్లోని పలు షాపుల్లో నిత్యం వందల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతుంటాయి. వారం రోజుల నుంచి బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు తగ్గిపోవడంతో చికెన్ సెంటర్ల నిర్వాహకులు నష్టాలు చూడాల్సి వస్తోంది. ఇక పలు హోటళ్లు, రెస్టారెంట్లలో చికెన్ బిర్యానీ, చికెన్‌తో చేసే ఇతర వంటకాలను తినేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. నాటుకోళ్లు, చేపలు, రొయ్యలు, మటన్, శాకాహార పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎప్పుడైనా గిరాకీ ఉండే చికెన్ బిర్యానీలను కొనేవారు తక్కువడంతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు డీలా పడుతున్నారు. ఈ క్రమంలో నాటుకోళ్లు, మటన్, చేపలు, రొయ్యల రేట్లు పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి చికెన్ విక్రయాలపై ఆధారపడిన తమకు బర్డ్‌ఫ్లూ వైరస్ తీరని నష్టాన్ని కలిగిస్తోందని చికెన్ సెంటర్ల యజమానులు, వాటిలో పనిచేసే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మకాలు నిర్వహించడం లేదు



బర్డ్ ఫ్లూ వైరస్ వదంతుల కారణంగా ప్రజలు చికెన్ కొనుగోలు చేయడం లేదు. వారం రోజులుగా అమ్మకాలు నిర్వహించడం లేదు. గతంలో రోజుకు సగటున 80 నుంచి 100 కిలోల చికెన్ అమ్మేవాళ్లం. మేం ముగ్గురు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాం. 25 ఏళ్లగా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. గతంలో బర్డ్ ఫ్లూ వైరస్ వచ్చిన సందర్భాలు ఉన్నా ఆ సమస్య తొందరగానే సమసిపోయేది. కానీ ఈ సారి పరిస్థితి మరింత జటిలమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని సహకరించాలి.

- బెజ్జంకి శ్రీనివాస్, చికెన్ సెంటర్ నిర్వహకుడు, టైలర్‌స్ట్రీట్

పర్యాటకం.. ప్రైవేటుకు!

(5వ పేజీ తరువాయి)

పద్ధతిలో తొలిదశలో ఐదు టూరిజం ప్రాంతాలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రణాళిక రూపొందించింది. వీటిలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకర్షించే లక్నవరం సరస్సు, కాళేశ్వరం, బొగత జలపాతం, మేడారం మహాజాతర ప్రాంతాలను ప్రైవేటుకు లీజుకు ఇవ్వనున్నారు. ఇప్పటికే వీటిలో కొన్నింటిని గత ప్రభుత్వం ప్రైవేటుపరం చేసింది. కాగా, ఆయా ప్రాంతాల్లో వచ్చే అదాయం ఆధారంగా 15ఏళ్ల నుంచి 66ఏళ్ల వరకు లీజుకు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ టెండర్ ద్వారా లీజు దక్కించుకున్న కంపెనీల నుంచి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కూడా చేయాల్సి ఉంటుంది. అయితే హరిత హోటళ్లను నిర్మించినా వాటి నిర్వహణ లేక చాలా చోట్ల తెరుచుకునే పరిస్థితి లేదు.ఈ నేపథ్యంలో ప్రైవేటుకు అప్పగిస్తే హోటళ్లతో పాటు బొగత, రామప్ప, లక్నవరం లాంటి ప్రాంతాల్లో రిసార్టులు కూడా అభివృద్ధి చెందుతాయనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు తెలంగాణ టూరిజం2025 పేరుతో వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టేందుకు పర్యాటకశాఖ కసరత్తు చేస్తున్నట్టుగా సమాచారం.

కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్

పర్యాటక రంగానికి కేరాఫ్‌గా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో టూరిజాన్ని మరింతా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవులగుట్టలను, ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే ఏటూరునాగారం అభయారణ్యంలో భాగంగా తాడ్వాయిలో చేపట్టిన పర్యాటక ప్రాంతాలు, బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌తో పాటు మల్లూరు గుట్టలను, గణపసముద్రం, వరంగల్ కోటా తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. ఓరుగల్లులో పాతికకు పైగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి, హోటళ్లు, రిసార్టులు నిర్మించి ప్రవేటుకు లీజుకు ఇచ్చేందుకు కూడా డీపీఆర్ రూపొందిస్తున్నట్లుగా సమాచారం.

సామాన్యులకు భారం.. ఉద్యోగుల్లో ఆందోళన

పర్యాటక ప్రాంతాలను ప్రైవేటుపరం చేస్తే సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రైవేటు కాంట్రాక్టు సంస్థలు ఎంట్రీ రుసుం పెంచే అవకాశాలున్నాయి. అంతేకాకుండా హరిత హోటళ్లు, రిసార్టుల్లో గదుల ధరలు కూడా పెంచే అవకాశం ఉంది. వీటితో పాటు తినే ఆహారాలు, పార్కింగ్ స్థలాల ధరలు పెరుగనున్నాయి. దీంతో సామాన్యులు కుటుంబసమేతంగా పర్యాటక ప్రాంతాలకు వెళ్లటం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఇప్పటికే హరిత హోటళ్లు, రిసార్టుల్లో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. తమ ఉద్యోగాల పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉన్నారు. మొత్తంగా పర్యాటకశాఖ తీసుకొస్తున్న కొత్త టూరిజం పాలసీతో ఓరుగల్లు పర్యాటకం పరుగులు పెట్టేనా అనే చర్చ జరుగుతోంది.

వైద్య విద్యార్థులు ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలి

- ములుగు కలెక్టర్ దివాకర
- మెడికల్ కళాశాలలో ముగిసిన కాలేజ్ ఫెస్ట్



మెడికల్ కాలేజ్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర్

ములుగు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణులై ఉత్తమ వైద్యులుగా ఎదగాని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కళాశాల మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతో కాలేజ్ ఫెస్ట్ నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన కార్యక్రమాలు మంగళవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ములుగులో వైద్యకళాశాల ఏర్పాటు కావడం గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో వసతులను మెరుగుపరుస్తామని వెల్లడించారు. వైద్యవిద్యను శ్రద్ధగా అభ్యసించి ఉత్తీర్ణులు కావాలన్నారు. రోగుల పట్ల దయతో ఉండాలని, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి తగ్గుతుందని, పాల్గొనడం ద్వారా నలుగురితో సత్సంబంధాలు మెరుగుపడటమే కాకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఆత్మన్యూనతాభావం తగ్గుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు మోహన్‌లాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, సీనియర్, జూనియర్ ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా అమ్మాయికి మెహందీ పండుగ

- మెట్టినింట సంప్రదాయ కార్యక్రమాలు
- హాజరైన కుటుంబ సభ్యులు, బంధువులు
- భద్రకాళి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజ



భద్రకాళి ఆలయంలో నూతన వధూవరులు, అమెరికా నుంచి వచ్చిన జెస్సిక కుటుంబీకులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మన కట్టు బొట్టు.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో రెండు రోజుల క్రితం నీరుకుళ్ల అబ్బాయి సతీష్ చంద్రను వివాహమాడిన అమెరికా అమ్మాయి జెస్సికకు అత్తింటివారు మంగళవారం తమ ఇంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. నూతన వధువుకు ముత్తైదువులు మెహిందీ పండగ నిర్వహించి, నల్లపూసల కార్యక్రమంలో పాటు చీర, సారె పోశారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన తాటిపర్తి రఘునాథ్‌రావు- వైశాలిని కుమారుడు సతీష్‌చంద్ర 2014లో ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లగా ప్లోరిడాకు చెందిన జెస్సికాతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. ఆదివారం ఆ జంట వివాహం అంగరంగ వైభవంగా జరగ్గా.. మంగళవారం వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని మర్రి వెంకటయ్య కాలనీ లో ఉన్న సతీష్‌చంద్ర నివాసంలో తమ సంప్రదాయ కార్యక్రమాలను పూర్తిచేశారు. నూతన వధువు జెస్సికను సంప్రదాయబద్ధంగా తయారు చేసి మెహందీ పండగ నిర్వహించారు. ముత్తైదువులు నల్లపూసలు గుచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో నూతన వధూవరులు తమ అత్త, మామలతో పాటు ముత్తైదువులు, ఇతర కుటుంబ పెద్దల ఆశీస్సులు అందుకున్నారు. ఆ తర్వాత చారిత్రక భద్రకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోగా.. అక్కడి వేద పండితులు జెస్సికతో కుంకుమ పూజ చేయించారు.

శివరాత్రి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ

కాశిబుగ్గ, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో ఈనెల22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి వేడుకల కరపత్రం, ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. హైకోర్టు అనుమతితో ఆలయ అభివృద్ధి పాత కమిటీ ఏర్పాట్లను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, మాజీ కౌన్సిలర్ దూపం సంపత్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోనె జగదీశ్వర్, వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, సముద్రాల పరమేశ్వర్, కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం, భాస్కర్, మండల శ్రీరాములు, రాజు, ఆంజనేయులు, ఈశ్వరయ్య, బాలరాజు, రమేష్, చిరంజీవి, రోజా, స్వరాజ్, ఆలయ పూజారులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్, తదితరులు

పలు రాష్ట్రాల్లో దడువాయి చార్జీల పరిశీలన

పర్యటిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్లలో దడువాయిలు రైతుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలను తెలుసుకునేందుకు రెండు రోజులుగా కార్మిక సంఘాల నాయకులు పలు రాష్ట్రాలలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్లను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్నారు. దడువాయి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్‌రెడ్డి, కార్యదర్శి నేనావత్ రవికుమార్, ఉపాధ్యక్షుడు వాసం సంజీవ్‌కుమార్, కోశాధికారి భోనాల వీరన్న, ఏఐకెఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ బంగు, జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు మంగళవారం చండీగఢ్‌లోని వ్యవసాయ మార్కెట్లలో తిరిగి ఏజెంట్లను, వ్యాపారులను, రైతులను కలిసి రైతుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలు ఎంత, కార్మికులకు చెల్లిస్తున్నది ఎంత అన్న పూర్తి వివరాలను పరిశీలించారు. పర్యటన పూర్తి అయిన తరువాత వివరాలను మీడియాకు, మార్కెట్ శాఖ అధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు చిలువేరు రవీందర్

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సభ్యుడిగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ ఘనంగా సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో నర్సిరెడ్డికి బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తౌటం సంపత్ కుమార్, కాంద్రాతి రాజు, పోలెపాక సాయికుమార్, చిన్న పాల్గొన్నారు.

వినయ్ భాస్కర్‌కు కేటీఆర్ అభినందన

కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులు ప్రదానం



దాస్యం వినయ్ భాస్కర్‌ను అభినందిస్తున్న కేటీఆర్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా పదవితో సంబంధం లేకుండా ప్రజల కోసం వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పనిచేస్తున్నారని మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం పట్ల దాస్యం వినయ్ భాస్కర్‌ను కేటీఆర్ అభినందించి క్రీడల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతును అందజేశారు. కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్‌తో పాటు ఇతర పోటీల్లో విజయం సాధించిన విజేతలను కేటీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ ఫారూక్, మాజీద్, అస్లాం, షాకీర్, వీరు, సిరాజ్, రాజేష్‌కుమార్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు రామ్మూర్తి, బుద్ధ వెంకన్న, పెద్ది రాజు, ప్రణయ్, యాదగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

భారీ మొత్తంలో గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ, గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు, జీఎస్టీ చెల్లించని సిగరెట్ పెట్టెలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ధర్మారం న్యూబీట్‌బజార్‌లోని మహాలక్ష్మి ట్రాన్స్‌ఫోర్ట్ నిర్వహకుడు శ్యామ్ నుంచి సీఐ పవన్‌కుమార్ టీం రూ. 84 వేల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అదే విధంగా మట్టెవాడ పీఎస్ పరిధిలోని సంతోషిమాత ఏరియాలోని గోదాంలలో పిన్నవారి స్ట్రీట్‌కి చెందిన మహేందర్ కుమార్, జబ్బర్ సింగ్, జేపీఎన్ రోడ్డుకు చెందిన కలురం అనే వ్యాపారస్తులు డంప్ చేసిన రూ. 12, 42,1250 విలువ గల గుట్కాలు, జీఎస్టీ చెల్లించని సిగరెట్ పెట్టెలను సీఐ కాసగాని శ్రీధర్ బృందం స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులందరికి ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2008 డీఎస్సీలో క్వాలీఫై అయిన 16 మందిలో ఏడుగురికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అన్యాయం చేశారని ఆరోపించారు. 2008 డీఎస్సీలో క్వాలీఫై అయిన జె. సోమ్లా, వెంకన్న, పి.శంకర్, రాములు, బి.వాల్యా, బి.రవీందర్, రాంమూర్తి, భాస్కర్, గణేష్‌కు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



శివనగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

సరోత్తంరెడ్డికి మద్దతుగా బీజేపీ ప్రచారం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ కోరారు. మంగళవారం 34వ డివిజన్ మండల అధ్యక్షుడు రఫీ అధ్యక్షతన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పులి సరోత్తంరెడ్డి మూడున్నర దశాబ్ధాల నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని అన్నారు. జీవో 317తో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పావుశెట్టి స్వరూప, టీవీఎల్ ఎన్ శ్రీనివాస్, శెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖిలావరంగల్‌లో నర్సిరెడ్డి ప్రచారం

ఖిలావరంగల్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీపీటీఎఫ్, యూటీఎఫ్ బలపలర్చిన ఉపాధ్యాయ అభ్యర్థి, ఉద్యమనేత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రమేష్, ఖిలావరంగల్ బాధ్యుడు బెల్లంకొడ పూర్ణచందర్, టీపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు సోమశేఖర్, సృజన్, ప్రసాద్, రామరాజు, శ్రీనివాస్, నాగరాజు, నీలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- కేసు దర్యాప్తు చేస్తున్న మిల్స్‌కాలనీ పోలీసులు

కరీమాబాద్, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): కరీమాబాద్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీమాబాద్ తారకరామ ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన బొల్లు రాకేష్ (25) అనే యువకుడు హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ తగాదాల కారణంగా రెండు సవంత్సరాల క్రితం తండ్రి వీరిని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో తల్లి బొల్లు రజిత ఒంటరిగా ఇక్కడే ఉంటోంది. ఈ నెల 15వ తేదీ శనివారం ఓ వివాహానికి హాజరయ్యేందుకు రాకేష్ కరీమాబాద్‌కు వచ్చాడు. వేడుకలో పాల్గొని అదేరోజు రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లి లేచి చూసేసరికి తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. విచారణ అనంతరం అనుమానాస్పద మృతిగా మంగళవారం కేసు నమోదు చేశారు. రాకేష్ మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక సమస్యలే కారణమా? లేక మరేదైనా ఉందా అని ఆరా తీస్తున్నామని మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వందేళ్ళ చరిత్ర కలిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంళవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. జిల్లా స్థాయి ఉత్సవాలు వరంగల్ నగరంలో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఎస్కే బాషుమియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, గుండె బద్రీ, సంగీ ఏలేందర్, మునీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన టిప్పర్

దంపతులకు స్వల్ప గాయాలు ● వరంగల్ లేబర్‌కాలనీలో ప్రమాదం



లారీ ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీ అపోలో ఫార్మసీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం గంగదేవిపల్లి గ్రామానికి చెందిన కుసుమ శంకరయ్య, లక్ష్మి దంపతులు కారులో వరంగల్‌కు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన టిప్పర్ లారీ డ్రైవర్ కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో దంపతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే వారిని 108లో ఎంజీఎంకు తరలించారు. మిల్సకాలనీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



భద్రకాళి చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్, బల్దియా కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భద్రకాళి చెరువు ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. చెరువులో పూడిక తీత పనులు, మట్టి తరలింపు తదితర అంశాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. చెరువు పూడికతీత పనులలో భాగంగా మట్టిని తరలించే క్రమంలో ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అంతర్గత రోడ్డు (అప్రోచ్ రోడ్డు) నిర్మించాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో రాత్రి పూట విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలన్నారు. మట్టి తరలింపు వాహనాల నమోదు కోసం చెక్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మునిసిపల్ శాఖలు 24 గంటల పాటు పర్యవేక్షించాలన్నారు. పూడికతీత మట్టి కావాలనుకునే వారు క్యూబిక్ మీటర్‌కు రూ. 72 చెల్లించి మట్టిని తీసుకుని వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మున్సిపల్, కుడా, నీటి పారుదల అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి సహకరించండి

వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా పలు కాలనీల్లో జరుగుతున్న డ్రైనేజీల నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గ్రేటర్ వరంగల్ 32వ డివిజన్ తెలంగాణ కాలనీలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు నిర్మిస్తున్న పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. నగరం అభివృద్ధికి స్థానికుల సహాయంతో పాటు కాలనీల పర్యవేక్షణ కమిటీల సలహాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఈఈ శ్రీనివాస్, టీపీఎస్ అనిల్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.

మహిళా జవాన్‌పై కోతుల దాడి

ఖిలావరంగల్,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్‌లో పారిశుధ్య కార్మికురాలు గన్నారపు తేజపై కోతి దాడి చేసింది. తూర్పుకోటకు చెందిన తేజ మంగళవారం శివనగర్‌లో రోడ్డు ఊడుస్తుండగా కోతుల గుంపు దాడి చేయడంతో ఎడమ మోచేయిపై తీవ్ర గాయం అయింది. స్థానికులు వెంటనే కోతులను తరిమేసి ఆమెను ఎంజీఎంకు తరలించారు. కాగా శివనగర్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉందని.. పిల్లలు, పెద్దలు ఆందోళన చెందుతున్నారని స్థానికులు తెలిపారు. నగరపాలక సంస్థ సిబ్బంది కోతులను పట్టి ఇతరప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

కేసీఆర్‌ను కలిసిన నన్నపునేని



కేసీఆర్‌కు బొకే అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

- మట్టెవాడ

హుండీ ఆదాయం రూ.6.88 లక్షలు



హుండీల నగదును లెక్కిస్తున్న సిబ్బంది

మట్టెవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బట్టల బజార్‌లోని శ్రీ బాలానగర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం హుండీలలో నగదును లెక్కించారు. మొత్తం రూ.6,88,114 ఆదాయం వచ్చినట్లు ఈవో రత్నాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, మాజీ ధర్మకర్త గందె గోవిందరాజులు, ఓలం గోవర్ధన్, శ్యామ్, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీ లక్ష్మీవెంకటేశ్వర సేవాసమితి సభ్యులు, ఆలయ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. కాంక్రీట్ మరిచారు



ఆంధ్ర బాలిక కళాశాల వద్ద కంకరపోసి వదిలేసిన రోడ్డు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బట్టల బజార్‌నుంచి రామన్నపేట రాజీవ్ గాంధీ విగ్రహం వరకు రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీనిపై గుంతలు పడడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు మంజూరు చేశారు. 20 రోజుల క్రితం బట్టల బజార్ ఆంధ్రాబాలిక కళాశాల ముందు నుంచి పనులు చేపట్టారు. కాని ఇంతవరకు రోడ్డు వేయలేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.



చెరువులోనే నిర్మాణం చేసిన దేవాలయం



ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన ఆలయం, గృహ నిర్మాణాలు

శ్యామల చెరువు పరిరక్షణపై నీలినీడలు

- బడా నాయకులు, ఉన్నతాధికారుల అండతోనే కబ్జాలు ?
- చెరువు శిఖం, నాలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లే లక్ష్యం
- కబ్జా స్థలాల్లో వెంచర్లు, అక్రమ నిర్మాణాలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని విలీన గ్రామాల్లో భూముల ధరలు రోజురోజుకు పెరుగుతూ ఆకాశాన్నంటాయి. దీంతో కబ్జాదారులు తమ పలుకుబడిని ఉపయోగించి కబ్జాలకు పాల్పడుతున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు కబ్జాకు కొత్త పుంతలు తొక్కుతున్నారని చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారి తమ అధికారాన్ని వినియోగించి కబ్జాల పర్వం కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా దేవుడి పేరు చెప్పి ఏకంగా చెరువులోనే నిర్మాణాలు చేపడుతూ చెరువు మత్తడితో సహా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా భూములను సైతం హస్తగతం చేసుకునేందుకు ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. గత 20 ఏళ్లుగా తన ప్రణాళికలను అమలు చేయడంలో సఫలీకృతుడవుతూ చెరువును పూర్తిగా కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు.

గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం రెవెన్యూ శివారు శ్యామల చెరువు సర్వే నెం.642లో సుమారు 67.22 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 100 ఫీట్ల బఫర్ జోన్, 97 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధి కాగా కొంత పట్టా భూమి ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలే తప్పా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని చట్టాలు చెబుతున్నాయి. ఒకవేళ ఎఫ్‌టీఎల్‌లో పట్టా భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపడితే చెరువు కుంచించుకుపోయి వరదనీరు చేరకుండా భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా గ్రామంలో బోర్లు, బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో పశుపక్ష్యాదులు తాగునీరు, మత్స్యకారుల కుటుంబాలు చేపలు పట్టే వృత్తిని కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. అంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా పట్టాదారుడు ప్రభుత్వ అనుమతి లేకుండా ఎక్కడ కూడా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని జిల్లా ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు.

దశల వారీగా కబ్జాలు

శ్యామల చెరువు దశల వారిగా కబ్జాకు గురవుతునే ఉందనే ప్రజలు పేర్కొంటున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారుతూ ప్రజాప్రయోజనాలను విస్మరిస్తున్నారు. కోట్లాది విలువైన చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ చుట్టు పక్కల ఉన్న భూములను కబ్జా చేసి అపార్టుమెంట్లు వేసి విక్రయించి చేసి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ శ్యామల చెరువు బఫర్‌జోన్, నాలాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ వెంచర్లు చేపట్టి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి కబ్జాల పర్వాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం శ్యామల చెరువులో గోశాల పేరుతో నిర్మాణాలు చేపట్టి ఏకంగా చెరువునే మింగేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు ఆక్రమిస్తే కూల్చివేతలు

- ఐబీ ఏఈ శ్రీనివాస్

చెరువులు ఆక్రమిస్తే కూల్చివేతలు తప్పవని ఐబీ ఏఈ శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలో శ్యామల చెరువుపై జాయింట్ సర్వే నిర్వహించాం. వరంగల్ నగర పోలీసు కమిషనర్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఐబీ అధికారుల పర్యవేక్షణలో జాయింట్ సర్వేలో భీమారం శ్యామల చెరువు సర్వే నెం.642లో 67 ఎకరాల విస్తీర్ణంలో ఎఫ్‌టీఎల్ పరిధి 97 ఎకరాలు, బఫర్ జోన్ 100 మీటర్లు ఉందని గుర్తించాం. వీటిలో ఎఫ్‌టీఎల్ పరిధిలో 26 ఇండ్లు, బఫర్ జోన్ పరిధిలో 100 ఇండ్లు ఉన్నట్లు గుర్తించి వారికి నోటీసులు కూడా జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కబ్జాలకు గురైన ప్రభుత్వ భూమిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

కాకినాడ జేఎన్‌టీయూ
వీసీగా నిట్ ప్రొఫెసర్


● ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ గవర్నర్ 6



వంగర బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ నిద్రలో భాగంగా విద్యార్థినులతో కలెక్టర్ ప్రావీణ్య

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- తనిఖీల కోసం అధికారుల నియామకం
- భోజనం సక్రమంగా ఉండకపోతే చర్యలు
- వంగర గురుకుల పాఠశాల హాస్టల్ నిద్రలో కలెక్టర్ ప్రావీణ్య 6



నేడు మేడారంలో తిరుగువారం

వనదేవతల పూజా సామగ్రిని భద్రపరచనున్న పూజారులు 7

యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప.. అసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం.. ప్రకృతి సోయగాల సమాహారం లక్నవరం.. కాళేశ్వరం గోదావరి తీరం.. నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం.. వీటికి తోడు వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి, పాఖాల సరస్సు.. లాంటి అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు నెలవు ఓరుగల్లు. వారాంతమొస్తే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు ఆధ్యాత్మికతలో ఓలలాడుతుంటారు. ఈ క్రమంలో పర్యాటకును మరింత ఆకర్షించేలా.. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రైవేట్ భాగస్వామ్యంలో బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన రూపురేఖలు మార్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లోని పలు హరిత హోటళ్లు, రిసార్టులు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుండగా.. తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం మరికొన్ని పర్యాటక ప్రాంతాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు చేయాలని భావిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రైవేట్ భాగస్వామ్యం కార్యరూపం దాల్చితే సామాన్యులపై ఆర్థికంగా మరింత భారం పడుతుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.



పర్యాటకం.. ప్రైవేటుకు..!

బీవోటీ పద్ధతిలో టూరిస్టు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు

- ఆదాయం పెంపుతో పాటు పర్యాటకులకు సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా చర్యలు
- 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు ప్రైవేటు కంపెనీలకు లీజుకిచ్చే యోచన
- ఆయా పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులు వారి చేతుల్లోకే
- తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు
- కొత్త పర్యాటక ప్రాంతాలపైనా ఫోకస్
- ప్రైవేట్‌కు అప్పగింతతో సామాన్యులపై భారం పడే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లులోని పర్యాటక ప్రాంతాలు ఇక ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనున్నాయి. బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రైవేటు సంస్థలకు 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు లీజుకు ఇచ్చేందుకు కొత్త పాలసీని తీసుకొస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఉన్న హరిత హోటళ్లు, రిసార్టులను చాలా వరకు గత ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించగా, తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం కొత్తగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్న మరికొన్నింటిని కూడా ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇలా ప్రైవేట్ భాగస్వామ్యంతో టూరిజాన్ని అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షించటం, కొత్త పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటం లక్ష్యంగా పర్యాటకశాఖ అడుగులు వేస్తుంది. అయితే ఈ విధానంతో భవిష్యత్తులో సామాన్యులకు టూరిజం భారంగా మారనుందనే టాక్ కూడా వినబడుతుంది.

పర్యాటకానికి కేరాఫ్ ఓరుగల్లు

ఓరుగల్లు.. పర్యాటకానికి పెట్టని కోట. కాకతీయుల చారిత్రత్మక కట్టడాలు, ప్రకృతి సోయగాలు ఉమ్మడి వరంగల్‌లో అనేకం ఉన్నాయి. ఆదివారం, ఇతర సెలవు దినాలు వచ్చాయంటే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వాహనాలు రయ్‌రయ్ మంటూ ఓరుగల్లు వైపు పరుగుతీస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు అసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం, ప్రకృతి సోయగాలతో కట్టిపడేసే లక్నవరం అందాలు, ఐల్యాండ్, కాళేశ్వరం గోదావరి జలాలు, ఆధ్యాత్మిక క్షేత్రం, పచ్చని అడవుల మధ్యన నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం సవ్వడులతో పాటు కనువిందు చేసే వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి, పాఖాల సరస్సు.. ఇలా అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు వరంగల్ నెలవు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు హోటళ్లు, రిసార్టులను ఏర్పాటు చేసింది. దేశీయ, విదేశీ పర్యాటకులు కూడా ఓరుగల్లు అందాలను చూసేందుకు సుదీర ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు.

ఇక ప్రైవేటు చేతిలోకి పర్యాటకం..

పర్యాటకానికి పర్యాయపదంగా ఉన్న ఓరుగల్లులోని అనేక ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్‌లో భాగంగా తెలంగాణ ట్రైబల్ సర్క్యూట్‌లో భాగంగా ములుగు, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లో రూ.83కోట్ల వ్యయంతో టూరిస్ట్ స్పాట్‌లు, కాటేజీలు, డార్మెటరీలు, హోటళ్లను నిర్మించింది. మేడారం, బొగత, లక్నవరం, గణపురం, కాళేశ్వరం, రామప్ప, మల్లూరు, ములుగు గట్టమ్మ, జంగాలపల్లి వద్ద, తాడ్వాయి తదితర ప్రాంతాల్లో హరిత హోటళ్లను నిర్మించారు. వీటిలో గత ప్రభుత్వం మేడారం, తాడ్వాయి, బొగత, జంగాలపల్లి, గట్టమ్మ హరిత హోటళ్లు, రెస్టారెంట్లను ప్రైవేట్‌కు లీజుకు ఇచ్చారు. అయితే గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీవోటీ పద్ధతిలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. హనుమకొండ హరిత కాకతీయ హోటల్ మినహా మిగతా అన్ని హోటళ్లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే యోచనలో ఉంది. హోటళ్లతో పాటు బీవోటీ పద్ధతిన పర్యాటక ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపడతోంది. బీవోటీ అంటే నిర్మాణం, నిర్వహణ, బదిలీ అని అర్థం. ఈ మూడు ప్రతిపాదికన టూరిజం ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా ప్రాజెక్టుల స్థాయిని బట్టి 15ఏళ్ల నుంచి 66ఏళ్ల వరకు లీజుకు ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ అంతా ఈ టెండర్ విధానంలో జరగనుంది.

తొలిదశలో ఓరుగల్లులోని ఐదు టూరిజం స్పాట్లు

రాష్ట్ర పర్యాటక శాఖ దేశంలోనే తెలంగాణను పర్యాటక రంగంలో టాప్-5లో ఉంచాలనే ఆలోచనతో భారీ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే బీవోటీ

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్/హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అధికారులు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా జిల్లాల అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, రబీ పంటలకు సాగునీరు, విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామని, రబీ సీజన్‌లో 2 లక్షల 28వేల ఎకరాలు సాగు చేస్తున్నారని, రైతు భరోసా కింద లక్షా 63వేల మందికి గాను 91 వేల మందికి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలను తరుచుగా తనిఖీ చేస్తున్నామని, ఆహార నాణ్యత, విద్యాబోధన మెరుగు పడిందని అన్నారు. విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జడ్పీ సీఈవో రామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాంతికుమారి, పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై కలెక్టర్‌లతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతికుమారి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా సరఫరా కొనసాగించాలని, రైతు భరోసాపై గ్రీవెన్స్‌సెల్‌ను జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఐదు రోజులలో అదనపు భూ వివరాల నమోదు పోర్టల్‌లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను వినియోగించుకుని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి సమస్య లేదని, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేతిపంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని డివిజన్లకు ధర్మసాగర్ నుంచి నీటి సరఫరాను చేయనున్నామన్నారు. ప్రస్తుతం 24 నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో అదనంగా 21 నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానీజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్‌లో పెట్రోల్ పోస్తున్న డీజీపీ సౌమ్యమిశ్రా, కలెక్టర్ సత్యశారద

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం

- డీజీ సౌమ్య మిశ్రా
- సెంట్రల్ జైలు ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ప్రారంభం 7

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా ఎదుట ఉన్న బయోగ్యాస్ ప్లాంట్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు కాలనీల ప్రజలు తడి పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి యంత్రాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో జమ చేయాలని అన్నారు. ప్రతీ రోజు బల్దియా నుంచి చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు విడి విడిగా చెత్తను అందిస్తే శుద్ధి చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి హార్టికల్చర్ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలకు ఎరువుగా అందించవచ్చని అన్నారు. బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ను ప్రతీ రోజు రెండు గంటల పాటు ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఇంకా పొడి చెత్తను ముందుగా డీఆర్‌సీసీ కేంద్రాలకు ఆ తర్వాత వివిధ ప్రాంతాలలోని రీ సైక్లింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. బయో ప్లాంట్ ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చని అన్నారు. రెండు రకాల చెత్తను వేరు వేరుగా సేకరించడం వల్ల డంపింగ్ యార్డ్‌కు పెద్ద ఎత్తున చెత్త వచ్చే సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగర ప్రజలు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బయోగ్యాస్ ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.



బయో గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్

- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మూతపడుతున్న విద్యా సంస్థలు
- విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. నర్సంపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నేడు అనేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయని అన్నారు. కొట్లాడి ప్రత్యేక తెలంగాణ సాధించుకుని బాగుపడతామనుకుంటే రాష్ట్రంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు నాలుగేళ్లుగా విడుదల కాకపోవడంతో టీచర్లకు వేతనాలు చెల్లించలేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయన్నారు. జీవో 317ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, ఉపాధ్యాయులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీ లేదని, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. నిరుద్యోగ యువకులు, ఉపాధ్యాయులు ఆలోచన చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమస్యలపై పోరాడే బీజేపీకి అండగా నిలవాలన్నారు. కస్తూర్బా గురుకులాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయులపై పనిభారం పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పడానికి పదేళ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న భ్రమలు తొమ్మిది నెలల్లోనే తొలగిపోయాయన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షత చూపిందని కాంగ్రెస్ మాట్లాడటం హాస్యాస్పదమని, బడ్జెట్ అనేది ఆయా రాష్ట్రాల అవసరాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసింది తక్కువేనని, బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లో రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టు కోసం రూ.2వేల కోట్లు వెచ్చించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. పార్లమెంట్‌లో అధికార పార్టీ ఎంపీ నైనప్పటికీ గ్రీన్‌ఫీల్డ్‌పై తాను మాట్లాడానని, రైతులకు అన్యాయం జరగవద్దని కోరడం జరిగిందన్నారు.

సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు సీతారాంనాయక్, కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్, భైరి మురళీకృష్ణ, హరిశంకర్, రాంచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, గూడూరు సందీప్, కాళీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు.

రాణిరుద్రమకు ఈటల పరామర్శ

నర్సంపేట పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నేత రాణిరుద్రమ, జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డిల తల్లి గోగుల జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం ఈటెల రాజేందర్ సందర్శించి పరామర్శించారు. మృతురాలు జయశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్



ఆంధ్రజ్యోతి

WWW.ANDHRAJYOTHY.COM

వరంగల్ రూరల్

WARANGAL RURAL ■ బుధవారం 19 ఫిబ్రవరి 2025

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

8



నాగేంద్రుడికి పూజలు చేస్తున్న రాజుచౌహాన్

నాగేంద్రుడికి మాఘ షష్టి పూజలు

గీసుగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌హవేలిలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మాఘ షష్టి పూజలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపురంగు పూలతో అలంకరించి కనుక వర్ణ నాగేంద్రుడికి నవరస క్షీరాభిషేకం చేశారు. సుబ్రహ్మణ్య కవచ పారాయణం సర్వసూక్త విధానంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. కాగా విద్యుత్ చీఫ్ ఇంజినీర్ రాజుచౌహాన్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి నిరంతరంగా విద్యుత్ సరాఫరా అయ్యేలా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయకమిటీ చైర్మన్ బాబురావు, రాజేందర్, కార్యదర్శి శ్రీధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రవిందర్‌ను గెలిపించి బీసీ వాదాన్ని నిలబెట్టాలి

మాజీ ఎమ్మెల్సీ పూల రవిందర్ సతీమణి విజయలక్ష్మి



ఉపాధ్యాయ ఓటర్లకు బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్న విజయలక్ష్మి

గీసుగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ పూల రవిందర్ గెలుపు కోసం ఆయన సతీమణి విజయలక్ష్మి ఉపాధ్యాయుల ఇండ్లకు వెళ్లి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. రవిందర్‌ను గెలిపించి బీసీ వాదాన్ని బలపరచాలని కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో గల ఉపాధ్యాయులను ఆమె కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రవిందర్‌కు 40 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. ఎమ్మెల్సీగా కూడా అనేక ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించారని ఆమె ఉదహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈవో తోట తిరుపతయ్య, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుందర్‌రాజ్ గెలుపు కోసం ప్రచారం



నర్సంపేటలో ప్రచారం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి సుందర్‌రాజ్ యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్, చెన్నూరి రవి, మద్దెల శ్యామ్‌లు పాల్గొన్నారు. అలాగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్యగౌడ్, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్, పంజాల వెంకట్ ఆధ్వర్యంలో సుందర్‌రాజ్ యాదవ్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.

మోడల్ మార్కెట్ భవనంలోనే..

- అమ్మకాలు జరిగేలా చూడాలి
- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మార్కెట్ భవనంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నర్సంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట పట్టణంలోని అంగడి ఆవరణలో గత కొన్నేళ్లుగా అలంకార ప్రాయంగా మారిన మోడల్ కూరగాయల మార్కెట్ భవనంలో కొన్ని మార్పులు చేసి అందులో కూరగాయల అమ్మకాలు జరిగేలా చూడాలని మునిసిపల్ అధికారులను అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. అంగడి ఆవరణలో, రోడ్డు పక్కన కూరగాయల అమ్మకాలు జరుపకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణంలో వృథాగా ఉన్న మోడల్‌కూరగాయల మార్కెట్ భవనంతో పాటు పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుతం అమలు చేసిన అమృత్, 2ఓ పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయించాలని మునిసిపల్ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి నమోదు రిజిష్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జోనా, ఏఈ రాజేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, డీఈ, ఆర్ఐ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల జాబితా పరిశీలన



నెక్కొండ హైస్కూల్‌లో ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నెక్కొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల స్థాయిలో కేటాయించిన పదో తరగతి ఇంటర్నల్ మార్కులను మండలంలోని నెక్కొండ హైస్కూల్, సెయింట్‌థెరిసా ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో మండల నోడల్ అధికారి బి. రవికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు కూడా ముఖ్యమంటూ ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెరిఫికేషన్ టీం సభ్యులు బి, శ్రావణ్‌కుమార్, రేణుక, రవీంద్రనాథ్, హై స్కూల్ హెడ్మాస్టర్ రంగారావు, సెయింట్ థేరిసా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ చల్లా యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాను పరిశీలన బృందం పరిశీలించింది. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా తెలుగు, హిందీ గణితం, ఆంగ్లము, సామాన్య, సాంఘిక విషయాలల్లో ప్రతీ సబెక్టుకు మార్కులు 20 చొప్పున నమోదును పరిశీలించారు. అలాగే జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్‌తేజ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత



ఖానాపురంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేస్తున్న వెంకటకృష్ణారావు

ఖానాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు మేడితాటి వెంకటకృష్ణారావు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, తదతర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చరణ్‌సింగ్, ఉపాధ్యాయులు భాస్కర్, శోభన్‌బాబు, డాక్టర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : విద్యార్థులకు పదో తరగతి విద్య ఎంతో ముఖ్యమైందని నెక్కొండ హైస్కూల్ హెడ్మాస్టర్ రంగారావు అన్నారు. నెక్కొండకు చెందిన రిటైర్డు విద్యుత్ ఏఈ చల్లా రఘోత్తంరెడ్డి పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షప్యాడ్లు, పెన్నులు, హాల్‌టికెట్ కవర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత విద్యల్లో సులభంగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుర్గపల్లి శ్రావణ్‌కుమార్, శ్రీదేవి, రమేశ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఝాన్సీరెడ్డి

ఎల్లమ్మ పూజల్లో పాల్గొన్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరులో ఎల్లమ్మతల్లి పండుగ వేడుకలో కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం గుట్ట మీద జరిగిన వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి అనుగ్రహంతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలి

ఖానాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలని ఏడీఏ దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మనుబోతులగడ్డలో కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించారు. యాసంగిలో సాగు చేసిన పంటలను ఫోటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ ఎకరాలో సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో బోగ శ్రీనివాస్, ఏఈవో ఆశాదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమానికి తరలి రావాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నేడు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ బడ్జేట్‌ను నిరసిస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ మంగళవారం ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జేట్ ప్రజల మౌలిక కేటాయింపులకు తగ్గించి సంపన్నులకు రాయితీలు కల్పించిందని దుయ్యాబట్టారు.

అంగన్‌వాడీలో అన్నప్రాశన

చెన్నారావుపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంగన్‌వాడీ సెంటర్‌లో అన్న ప్రసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త మేడి సరోజన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరాధన గుగులోతు లలిత, నేజీ, కళ్యాణి బానోతు శ్రీనువాస్ పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఇల్లందులో ప్రత్యక్షం

ఖానాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సైనిక్ స్కూల్, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్న విద్యార్థి పాఠశాలలో అదృశ్యమై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో మంగళవారం ప్రత్యక్షమయ్యాడు. పా ఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, పోలీస్‌లు, విద్యార్థి తండ్రి నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం, పడుగోనిగూడెంనకు చెందిన వజ్జ సాయివర్ధన్ (17) గిరిజన సైనిక్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 14న సాయివర్ధన్ పుట్టిరోజున తండ్రి స్కూల్‌కు వచ్చి విద్యార్థితో మాట్లాడి వెళ్లిపోయా డు. ఈనెల 15న తన తోటి విద్యార్థి పుట్టిన రోజు ఉండటంతో తన పుట్టిన రోజు తో పాటు తోటి విద్యార్థి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడానికి నిశ్చయించుకున్నాడు. 15న రాత్రి స్టడీ అవర్ అయిపోయిన తరువాత అర్ధరాత్రి సమయంలో పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు తెలియకుండా విందు చేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం ఇదే పాఠశాల, కళాశాలలో డిగ్రీ చదువుతున్న సీనియర్ విద్యా ర్థులు సాయివర్ధన్‌ను అర్ధరాత్రి పార్టీ చేసుకోవ డంపై మందలించడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ విషయం ఉపాధ్యాయులకు తెలి స్తే చర్యలు తీసుకుంటారనే భయంతో ఈనెల 17న ఉదయం 6గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్ సోమ వారం విద్యార్థి తండ్రి నారాయణకు సమాచా రం అందించగా, ఆచూకీ కోసం ఇరువురూ ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ప్రిన్సిపాల్ పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎస్సై రఘుపతి పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా సాయివర్ధన్ కోసం అతని బంధువులు సైతం వెతుకుతుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో మంగళవారం సాయంత్రం ఆచూకీ లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి ఆచూకీ లభించడంతో అతని కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల యాజ మాన్యం ఊపిరిపీల్చుకున్నారు.

దర్గాలో తలనీలాల అవకతవకలపై విచారణ



దర్గా వద్ద విచారణ చేస్తున్న అధికారులు

రాయపర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో గల యాకూబ్‌షావలి బాబా దర్గాలో భక్తులు సమర్పించిన తలనీలాల అవకతవకలపై మంగళవారం మైనారిటీ సంక్షేమ అధికారి టి.రమేష్ విచారణ చేపట్టారు. మహిళలు సమర్పించిన పొడవైన తలనీలాలు విక్రయించారని, పురుషులు సమర్పించిన చిన్నపాటి తలనీలాలు మాత్రమే నిల్వ చేశారని గుర్తించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ రియాజ్‌పాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో భూములకు సాగునీరు

రాయపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పర్వతగిరి మండలంలోని రావూరు, మోత్యాతండా, సీత్యాతండా గ్రామాల్లోని భూములకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని పలువురు రైతులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఇటీవల కలిసి కోరారు. కాలువలన్నీ పిచ్చిచెట్లతో నిండిపోయి, పూడిక పేరుకుపోయి నీరు రావడంలేదని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని తన స్వంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేసి కాలువలను శుభ్రం చేయించారు. కాలువల్లో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించి, పూడికను తీసివేశారు. అనంతరం కాలువల ద్వారా నీరు వదలడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య రోజుల వ్యవధిలోనే పరిష్కారం అయ్యిందని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వేమన ఆధ్యాత్మిక పద్యాల పుస్తకాల పంపిణీ

చెన్నారావుపేట, ఫిబ్రవరి 18: (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దార్థ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వేమన ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో పని చేస్తున్న ముదరు పద్మ అందించిన ఆధ్యాత్మిక పుస్తకాలను సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధ్యాత్మిక భావనను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రబెల్లి ఉష జన్మదిన వేడుకలు

రాయపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు శ్రీరామచంద్రస్వామి ఆలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఎర్రబెల్లి ఉష జన్మదిన వేడుకలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మహేందర్ రెడ్డి, కోల సంపత్, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఏంఎంవో

సంగెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లారుగూడ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన రికార్డులను, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కాగా ఏఎంవోను స్థానిక ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్. ప్రవీణ్ కుమార్, నాగూర్‌మీరావళి, భావన, వనజ, శివకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లం నవీన్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కేరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రుచిత అసోసియేట్స్ సౌజన్యంతో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ సంవత్సరం 300 నుంచి 400 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కేసీ కోఆర్డినేటర్ రహీమొద్దిన్, రుచిత అసోసియేట్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జోషప్‌రెడ్డి, బైరి సత్యనారాయణ, కందాల సత్యనారాయణ, ఎం. రాంబాబు, భద్రు, రాజీరు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు గ్రీన్‌ఫీల్డ్ బాధితుల వినతి



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఈటల

గీసుగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూములు కోల్పోయిన రైతులు గంగదేవిపల్లి వద్ద మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద పోయిన భూములకు రిజిస్ట్రేషన్ విలువల ఆధారంగా ధర ఇవ్వటం వల్ల తక్కువగా వస్తోందని గీసుగొండ, సంగెం, ఆత్మకూరు, నడికూడ మండలాల రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్లమెంటులో భూనిర్వాసిత రైతుల గురించి మాట్లాడినందుకు రాజేందర్‌కు బాధిత రైతులు ధన్యవాదాలు తెలిపారు. కాగా స్పందించి రాజేందర్ మీకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రధాని మోదీకి వివరించి న్యాయం జరిగేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు. పగడాల రాజ్‌కుమార్, రైతుసంఘం నాయకులు కూసం రాజమౌళి ఉన్నారు.

వీవో తప్పిదాలకు వీవోఏలే బాధ్యులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామైఖ్య సంఘాలలో నెలసరి జరిగే లావాదేవీలలో పొరపాట్లు జరిగితే వీఓ సహాయకులు, వీఓ ప్రతినిధులే బాధ్యత వహించాలని డీఆర్‌డీఏ ఏపీఎం వేణు, సీబీఓ ఆడిటర్ వెంకట్ అన్నారు. మంగళవారం మండల సెర్ప్ కార్యాలయంలో ఉప్పరపల్లి, నల్లబెల్లి, కట్ర్యాల, సంగెం మండలంలోని వెంకటపూర్, నల్లబెల్లి గ్రామాల గ్రామైఖ్య రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబర్ 2024 వరకు జరిగిన లావాదేవీలను డీఆర్‌డీవో కౌసల్యాదేవి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామైఖ్య సంఘాల రికార్డులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో వారి వెంట సీసీలు గొలి కొమురయ్య, స్వామి, స్త్రీనిధి మేనేజర్ కపిల్, వర్ధన్నపేట సంగెం మండలాల వీఏఓలు, ప్రతినిధులు, కట్ట రజిత, భవాని, వీఓఏలు బిర్రు దయాకర్, మంజుల, భిక్షపతి, రాము, రాజారాణి, ఎంఎస్ రేవతి సీవో మురళి, పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై సంపూర్ణ అవగాహన అవసరం

నల్లబెల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై ప్రజలకు సంపూర్ణ అవగాహన అవసరమని ఎంపీడీవో నరసింహమూర్తి అన్నారు. మండలంలోని బోల్లోనిపల్లిలో మంగళవారం జీపీ కార్యాలయంలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సును వైఆర్‌జీకేర్‌ఎల్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. హెచ్‌ఐవి ఉన్న తల్లిదండ్రులతో పిల్లలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

అలాగే లైంగిక సంబంధాలు పవిత్రంగా ఉండాలన్నారు. లేదంటే రక్త మార్పిడి వల్ల ఒకరి నుంచి ఒకరికి హెచ్‌ఐవి సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, వైఆర్‌జీకేర్ సూపర్వైజర్ రజిని, క్లస్టర్ వర్కర్ వీరన్న, జీపీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విహారయాత్రకు గురుకుల విద్యార్థినులు

రాయపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పర్వతగిరి మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థినులను ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం పాకాలలోని బొటానికల్ పార్కుకు విహారయాత్రకు తీసుకువెళ్లారు. అదే విధంగా ఈనెల 21న ముల్కనూరు పాల డైరీని విద్యార్థినులతో సందర్శించనున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు శిశువు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబు నగర్‌లో ఇటీవల ఆడశిశువు విక్రయించారన్న ఆరోపణల నేపథ్యంలో చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు విచారణ చేపట్టి శిశువును మంగళవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

ఈ సందర్భంగా జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ మాట్లాడుతూ గ్రామానికి చెందిన బానోతు అనిత, రవి దంపతుల 15 రోజుల ఆడశిశువు వారి వద్ద లేకపోవడం తో ఎవరికో విక్రయించారనే ప్రచారం జరిగిందన్నారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులతో విచారణ చేపట్టగా అనిత సోదరి పద్మ ఇంట్లో ఆడ శిశువు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీంతో పద్మ వద్ద నుంచి శిశువును తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపా రు. కార్యక్రమంలో డీసీపీవో శ్రీదేవి, పీవో రాజు, ఎన్‌సీసీవో సురేష్, సీడబ్ల్యూసీ సభ్యులు మధు, సుజాత, సాహెద, రమలీల, స్వామి, మేఘ్యానాయక్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

గీసుగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం సమీపంలో గల కమర్షియల్ హోల్‌సేల్ కాంప్లెక్స్‌లోని మహాలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ షాపులో అక్రమంగా అమ్ముతున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్‌లో నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్నట్లు సమాచారం రావటంతో ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో రూ. 86 వేల విలువైన ఆర్ఆర్ 168 పాకెట్లను స్వాధీనం చేసుకుని, షాపు నిర్వాహకుడు ఆవర్ల శ్యాం, అతడికి సరుకును పంపిణీ చేసిన రాజ్‌పురోహిత్ (గబ్బర్‌సింగ్)పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేషన్‌షాపుల తనిఖీ

గీసుగొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచర్ల, గొర్రెకుంట, గీసుగొండలలో గల రేషన్‌షాపులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న బియ్యం, స్టాక్ రిజిస్టర్ వివరాలను పరిశీలించారు. అయితే కొన్ని షాపుల స్వల్ప వ్యత్యాసం వచ్చినట్లు సమాచారం. కాగా షాపుల్లో ఎటువంటి తేడా రాలేదని డీటీ కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం మచ్చాపూర్ రేషన్‌షాపులో బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినట్లు బయటపడటంతో తనిఖీలు చేసినట్లు తెలిసింది.

క్రికెట్ పోటీల్లో విజేతలుగా జర్నలిస్టు టీం

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబేద్కర్ నగర్‌లో మంగళవారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ రెండో లిగ్‌లో వర్ధన్నపేట పోలీసు టీంపై వర్ధన్నపేట జర్నలిస్టు టీం విజయం సాధించింది.